ఏఎంఎస్ఎల్ తెలంగాణ ప్రాజెక్టుకు ఎస్బీఐ రుణం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: మౌలిక సదుపాయాల కల్పన సంస్థ ఏఎంఎస్ఎల్..హైదరాబాద్‌లో నిర్మించతలపెట్టిన నూతన ప్రాజెక్టుకు బ్యాంకింగ్ దిగ్గజం ఎస్బీఐ రూ.110 కోట్ల రుణాన్ని మంజూరు చేసింది. తెలంగాణలో రూ.210 కోట్ల పెట్టుబడితో రక్షణ రంగ పరికరాల ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేయబోతున్నట్లు ఇటీవల అపోలో మైక్రో సిస్టమ్స్ లిమిటెడ్(ఏఎంఎస్ఎల్) ప్రకటించిన విషయం తెలిసిందే. మౌలిక, రవాణా, ఏరోస్పేస్ రంగాలతోపాటు ఇతర విభాగాల్లో సేవలు అందిస్తున్నది.

బీవోబీ 2,500 కోట్ల సేకరణ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: ప్రభుత్వ రంగ సంస్థ బ్యాంక్ ఆఫ్ బరోడా(బీవోబీ) టైర్-2 బాండ్లను జారీ చేయడంతో రూ.2,500 కోట్ల నిధులను సమీకరించింది. బాసెల్ 3కు లోబడి టైర్-2 బాండ్ల సిరీస్ 16 జారీ చేసిన బాండ్లకు పెట్టుబడిదారుల నుంచి విశేష స్పందన లభించిందని, కూపన్ రేటును 7.57 శాతంగా నిర్ణయించింది. పదేండ్ల కాలపరిమితితో అన్‌సెక్యూర్డ్, లిస్టెడ్, నాన్-కన్వర్టబుల్ లభించనున్నాయి.

బైజూస్ వ్యవస్థాపకుడికి బై

రవీంద్రనాథ్‌ను బయటకు పంపేందుకు నేడు ఈజీఎం

ముంబై, ఫిబ్రవరి 22: ఎడ్‌టెక్ కంపెనీ బైజూస్ వ్యవస్థాపకుడు, సీఈవో బైజూ రవీంద్రన్‌ను బయటకు పంపేందుకు కంపెనీ షేర్ హోల్డర్లు ఓటు చేసేందుకు సిద్ధమవుతున్నారు. పలు అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపిస్తూ కంపెనీ యాజమాన్యమైన రవీంద్రనాథ్, ఆయన కుటుంబాన్ని తొలగించేందుకు కొంతమంది ఇన్వెస్టర్లు డిమాండ్ చేసిన అత్యవసర సర్వసభ్య సమావేశం (ఈజీఎం)శుక్రవారం ఫిబ్రవరి 23న జరగనుంది. ఉన్నత యాజమాన్యం తొలగింపునకు ఈజీఎంలో తీర్మానాన్ని ఆమోదిస్తారు. అయితే ఈజీఎంలో ఆమోదించిన ఎటువంటి తీర్మానాన్ని అయినా తదుపరి విచారణలోగా అమలు చేయరాదని కర్నాటక హైకోర్టు ఆదేశించినందున, మార్చి 13 వరకూ ఈ తీర్మానం అమలుకాదు. ఈజీఎంపై స్టే విధించాలని బైజూస్ హైకోర్టును ఆశ్రయించగా, అందుకు న్యాయమూర్తి నిరాకరించారు. రవీంద్రనాథ్, ఆయన కుటుంబ సభ్యులకు బైజూస్ ప్రమోటింగ్ కంపెనీ థింక్ అండ్ లెర్న్ ప్రైవేట్ లిమిటెడ్‌లో 26.3 శాతం వాటా ఉంది. 32 శాతం పైగా వాటా ఉన్న కొన్ని ఇన్వెస్టింగ్ సంస్థలు ఈజీఎం కోసం పట్టుపట్టాయి. ఫేస్‌బుక్ చీఫ్ మార్క్ జుకర్‌బర్గ్ సతీమణి చాన్ జుకర్‌బర్గ్‌తో సహ బ్లాక్‌రాక్‌తో సహ పలు అంతర్జాతీయ ఈక్విటీ ఫండ్స్‌కు థింక్ అండ్ లెర్న్‌లో వాటాలు ఉన్నాయి.

ఆరోపణలివి..

కంపెనీ యాజమాన్యం ఆర్థిక దుర్వినియోగానికి పాల్పడిందంటూ జనరల్ అట్లాంటిక్, పీక్ ఎక్స్‌వీ, సోఫినా, చాన్ జుకర్‌బర్గ్, ఓవెల్, శాండ్స్ తదితర ఇన్వెస్టర్లు ఈజీఎం నోటీసును జారీచేశారు. నోటీసులో పేర్కొన్న ఆరోపణలివి..

- ఆర్థిక అవకతవకలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఇచ్చిన షోకాజ్ నోటీసుకు సమాధానం ఇవ్వడంలో కంపెనీ యాజమాన్యం వైఫల్యం చెందడం
- రుణదాతలతో టెర్మ్ రుణాల్ని పరిష్కరించుకోకపోవడం
- టెర్మ్ రుణంపై షేర్‌హోల్డర్లను రవీంద్రన్ తప్పుదోవ పట్టించారంటూ ఆరోపణ
- క్రికెట్ స్పాన్సర్‌షిప్‌పై బీసీసీఐతో వివాదం
- ఆడిట్స్‌ను పూర్తి చేయకపోవడం
- టీడీఎస్ ద్వారా మినహాయించిన పన్నులు, ప్రావిడెంట్ ఫండ్‌తో సహ ఇతర చట్టబద్ధ చెల్లింపుల్లో జాప్యం చేయడం
- సంస్థను వీడిన ఉద్యోగులకు ఫైనల్ సెటిల్‌మెంట్‌తో సహ సిబ్బందికి చెల్లింపుల్ని జాప్యం చేయడం

119 కోట్లకు టెలికం సబ్‌స్క్రైబర్లు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: దేశవ్యాప్తంగా టెలికం సబ్‌స్క్రైబర్లు అంతకంతకు పెరుగుతున్నారు. డిసెంబర్ 2023 నాటికి సబ్‌స్క్రైబర్ల సంఖ్య 119 కోట్లకు చేరుకున్నట్లు టెలికం నియంత్రణ మండలి ట్రాయ్ తాజాగా వెల్లడించింది. టెలికం దిగ్గజాలైన రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్‌లు నూతన సబ్‌స్క్రైబర్లను ఆకట్టుకోవడంతో టెలికం సబ్‌స్క్రైబర్లు పెరగడానికి ప్రధాన కారణమని తెలిపింది. అలాగే బ్రాడ్‌బ్యాండ్ వినియోగదారులు స్వల్పంగా పెరిగి 90.4 కోట్లకు చేరుకున్నారని తెలిపింది. మొత్తం వినియోగదారుల్లో 76 శాతం వీరే ఉన్నారని నెలవారి సమీక్షలో వెల్లడించింది. గతేడాది నవంబర్ చివరినాటికి 118.57 కోట్ల మంది టెలిఫోన్ సబ్‌స్క్రైబర్లు ఉండగా, ఆ మరుసటి నెల చివరినాటికి ఈ సంఖ్య 119.03 కోట్లకు చేరుకున్నట్లు తెలిపింది. కంపెనీల వారిగా చూస్తే రిలయన్స్ జియో నెట్‌వర్క్‌ను 39.94 లక్షల మంది మొబైల్ సబ్‌స్క్రైబర్లు ఎంచుకోగా, భారతీ ఎయిర్‌టెల్‌ను 18.5 లక్షల మంది ఎంచుకున్నారు. కానీ, వొడాఫోన్ ఐడియా మాత్రం 13.68 లక్షల మంది మొబైల్ కస్టమర్లను కోల్పోగా, ప్రభుత్వరంగ సంస్థ బీఎస్ఎన్ఎల్ కూడా 1.5 లక్షలు, ఎంటీఎన్ఎల్ 4,420 మంది వైదొలిగారు.

- వైర్‌లైన్ వినియోగదారులు 3.15 కోట్ల నుంచి 3.18 కోట్లకు పెరిగారు
- వీరిలో రిలయన్స్ జియో వైర్‌లైన్‌ను 2.46 లక్షల మంది కస్టమర్లు ఎంచుకున్నారు.
- ఎయిర్‌టెల్ 82,317 మంది..వొడాఫోన్ ఐడియాను 9,656, క్వాడ్రాంట్‌ను 6,926 మంది జతయ్యారు.
- బీఎస్ఎన్ఎల్ 34,250 వైర్‌లైన్ కస్టమర్లను కోల్పోయింది. టాటా టెలీసర్వీసెస్ 22,628, ఎంటీఎన్ఎల్ 11,325, ఏపీఎస్ఎఫ్ఎల్ 1,214, రిలయన్స్ కమ్యూనికేషన్స్ 627 కస్టమర్లు కోల్పోయారు.
- బ్రాడ్‌బ్యాండ్ వినియోగదారులు 85.79 కోట్ల నుంచి 86.52 కోట్లకు చేరుకున్నారు. వైర్డ్ బ్రాడ్‌బ్యాండ్ కనెక్షన్లు 1.46 శాతం పెరిగి 3.83 కోట్లకు చేరుకున్నారు.
- మొత్తం బ్రాడ్‌బ్యాండ్ వినియోగదారుల్లో 98.35% కస్టమర్లు తొలి ఐదు సంస్థలకు చెందినవారే కావడం విశేషం.

ద్రవ్యోల్బణం అదుపు తప్పుతుంది

ముందస్తుగా వడ్డీ రేట్ల తగ్గింపుపై ఆర్బీఐ గవర్నర్ వాదన

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: ద్రవ్య విధానాన్ని ముందస్తుగానే సరళతరం చేస్తే ఇప్పటి వరకూ ద్రవ్యోల్బణంపై సాధించిన విజయం వృధా అయిపోతుందని రిజర్వ్‌బ్యాంక్ గవర్నర్ శక్తికాంతదాస్ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఫిబ్రవరి రెండోవారంనాటి మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) సమావేశపు మినిట్స్‌ను గురువారం ఆర్బీఐ విడుదల చేసింది. ప్రస్తుత తరుణంలో అత్యంత జాగురూకతతో ద్రవ్య విధానం ఉండాలని 'ద్రవ్యోల్బణంపై మన పోరు ఇంకా ఆగలేదని' దాస్ పేర్కొన్నట్టు మినిట్స్ వెల్లడించింది. ద్రవ్యోల్బణాన్ని దించే చివరి ప్రయాణం క్లిష్టమైనదని, దీనిని విజయవంతంగా అధిగమించేందుకు ఎంపీసీ కట్టుబడి ఉండాల్సిందేనని గవర్నర్ వ్యాఖ్యానించారు. వడ్డీ రేట్లు తగ్గుతాయన్న అంచనాలతో కేంద్ర బ్యాంక్‌లకంటే మార్కెట్లు ముందే పరిగెడుతున్నాయని, కానీ ఎటువంటి ముందస్తు చర్య అయినా ఇప్పటివరకూ సాధించిన విజయాల్ని నిర్వీర్యం చేస్తుందని శక్తికాంత్ దాస్ ఆ సమావేశంలో ఎంపీసీ సభ్యులను హెచ్చరించినట్టు మినిట్స్ వివరించింది.

తగ్గించాలన్న జయంత్ వర్మ

ఆరుగురు ఎంపీసీ సభ్యుల్లో ఐదుగురు రెపో రేటును 6.5 శాతం వద్దే కొనసాగించాలని ఓటు చేయగా, మరో సభ్యుడు జయంత్ ఆర్ వర్మ మాత్రం రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు తగ్గించాలని, కఠిన ద్రవ్య విధాన వైఖరిని 'న్యూట్రల్'కు మార్చాలంటూ ఓటు చేశారు. ద్రవ్యోల్బణం అదుపు, వృద్ధి పెంపు.. రెండింటిపై దృష్టిపెడుతున్న సంకేతాల్ని ఇవ్వాల్సిన సమయం వచ్చిందని అన్నారు.

యూలు బైక్స్‌లో బజాజ్‌కు వాటా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: బజాజ్ ఆటో..ఎలక్ట్రిక్ బైకుల సంస్థ యూలు బైక్స్‌లో మరో రూ.45.75 కోట్ల పెట్టుబడి పెట్టింది. ఈ పెట్టుబడి అనంతరం బజాజ్ వాటా 18.8 శాతానికి చేరుకున్నది. 2019లో సంస్థ 8 మిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టిన విషయం తెలిసిందే.

సురక్షిత ప్రయాణమే లక్ష్యం: ర్యాపిడో పవన్

హైదరాబాద్/సైదాబాద్, ఫిబ్రవరి 22: నగర ప్రజలకు సురక్షితమైన, నమ్మదగిన రవాణా సదుపాయాన్ని అందిస్తూ.. ప్రయాణికులను సమయానికి గమ్యస్థానాలకు చేర్చడంలో ర్యాపిడో కీలకపాత్ర పోషిస్తున్నదని ఆ సంస్థ వ్యవస్థాపకుల్లో ఒకరైన పవన్ గుంటుపల్లి అన్నారు. అదే మా లక్ష్యం కూడా అని స్పష్టం చేశారు. గురువారం ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని చంపాపేట మినర్వా గార్డెన్‌లో జరిగిన ర్యాపిడో క్యాబ్ మహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ.. గత ఏడాది మే నెలలో హైదరాబాద్ నగరంలో ర్యాపిడో క్యాబ్స్ రంగంలోకి దిగాయని, అప్పుడే 50 వేలకుపైగా క్యాబ్ కెప్టెన్‌లను కలిగి ఉన్నామన్నారు. ఇప్పటిదాకా 4 లక్షల రైడ్‌లను విజయవంతంగా పూర్తిచేసినట్టు తెలిపారు. ఇక దేశవ్యాప్తంగా 3 లక్షల కెప్టెన్లు తమ వేదికపైకి వచ్చారని, సాస్ ఆధారిత మోడల్ ఉపాధి పొందటానికి అనేక అవకాశాలున్నాయని వివరించారు. కనీస సభ్యత్వ రుసుము చెల్లించి, ఆన్‌లైన్ ద్వారా కార్యకలాపాలను సులువుగా పొందటానికి, కెప్టెన్ల సంఖ్యను గణనీయంగా పెంచుకుంటూ వెళ్తున్నట్టు చెప్పారు. హైదరాబాద్ లోనూ కెప్టెన్లకు మరింత ఆదాయం సమకూరేలా కృషి చేస్తున్నట్టు వెల్లడించారు. అనంతరం కెప్టెన్ల అభిప్రాయాలను, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొన్నింటికి పరిష్కార మార్గాలనూ చూపించారు. ఇదిలావుంటే క్యాబ్ మహోత్సవంలో భాగంగా అంకిత భావంతో పనిచేస్తూ అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తున్న 1,500లకుపైగా కెప్టెన్లను ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు. విలువైన ప్రశంసా పత్రాలను అందజేశారు.

ర్యాపిడో కెప్టెన్లకు బహుమతులను అందజేస్తున్న ఆ సంస్థ సహ వ్యవస్థాపకుడు పవన్ గుంటుపల్లి

పెయింట్స్ రంగంలోకి బిర్లా గ్రూపు

రూ.10 వేల కోట్లతో మూడు ప్లాంట్లు ప్రారంభించిన సంస్థ

పానిపట్, ఫిబ్రవరి 22: ఆదిత్యా బిర్లా గ్రూపు తాజాగా పెయింట్స్ రంగంలోకి అడుగుపెట్టింది. దేశవ్యాప్తంగా పెయింట్ల పరిశ్రమ అంచనాలకుమించి వృద్ధిని నమోదు చేసుకుంటుండటంతో ఈ రంగంలోకి ప్రవేశించినట్లు ఆదిత్యా బిర్లా గ్రూపు చైర్మన్ కుమార మంగళం బిర్లా తెలిపారు. వచ్చే మూడేండ్లకాలంలో ఈ రంగుల పరిశ్రమలో రూ.10 వేల కోట్ల ఆదాయంతోపాటు లాభాలు ఆర్జించగలిగే స్థాయికి ఎదుగుతామని ఆయన అన్నారు. బిర్లా ఓపస్ పేరుతో ఈ రంగులను విక్రయిస్తున్నది సంస్థ. అంతర్జాతీయంగా ఏ సంస్థ కూడా ఒకేరోజు ప్లాంట్‌ను, ఆపరేషన్స్, ఉత్పత్తి, సేవలను ప్రారంభించలేదని, కానీ, ఆదిత్యా బిర్లా గ్రూపు ఈ రికార్డును సొంతం చేసుకున్నదన్నారు.

మూడు ప్లాంట్లలో ఉత్పత్తి స్టార్ట్

రంగులను ఉత్పత్తి చేయడానికి దేశవ్యాప్తంగా ఒకేసారి మూడు ప్లాంట్లను ప్రారంభించింది ఆదిత్యా బిర్లా గ్రూపు. పానిపట్(హర్యానా), లుధియానా(పంజాబ్), చెయ్యర్(తమిళనాడు)లలో ఈ మూడు ప్లాంట్లను ఆరంభించింది. ఆదిత్యా బిర్లా గ్రూపునకు చెందిన గ్రాసిం ఇండస్ట్రీస్..డెకరేటివ్ పెయింట్స్ వ్యాపారంలోకి అడుగుపెట్టబోతున్నట్లు గతేడాది ప్రకటించింది. రూ.10 వేల కోట్ల పెట్టుబడితో దేశవ్యాప్తంగా ఆరు తయారీ కేంద్రాలను 2025 వరకు ఏర్పాటు చేయబోతున్నది. ఈ పెట్టుబడుల్లో ఇప్పటికే రూ.5 వేల కోట్లను ఖర్చు చేసినట్లు ఆయన చెప్పారు. హర్యానాతోపాటు పంజాబ్, తమిళనాడు, కర్నాటక, మహారాష్ట్ర, బెంగాల్‌లో నెలకొల్పనున్న ప్లాంట్లలో ఏడాదికి 1,332 మిలియన్ టన్నులు కలర్స్‌ను ఉత్పత్తి చేయనున్నది. గురువారం ఒకేరోజు మూడు ప్లాంట్లను ప్రారంభించిన సంస్థ..మిగతా మూడు ప్లాంట్లు వచ్చే ఏడాది చివరినాటికి అందుబాటులోకి రానున్నాయి. వచ్చే నెల తొలివారం నుంచి బిర్లా ఓపస్ కలర్స్ మార్కెట్లోకి అందుబాటులోకి రానున్నాయి. రూ.80 వేల కోట్ల స్థాయిలో ఉన్న రంగుల పరిశ్రమలోకి ఆదిత్యా బిర్లా గ్రూపు ప్రవేశించినట్లైంది. ప్రస్తుతం మార్కెట్లో ఏషియన్ పెయింట్స్, బర్గర్ పెయింట్స్, నెరోలాక్, అక్జోనోవెల్ బ్రాండ్లు ఉన్నాయి.



మందగమనంలోకి దేశ ఆర్థికం!

2024-25లో జీడీపీ 6.5 శాతమే • ఇండియా రేటింగ్స్ అంచనా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: వచ్చే ఆర్థిక సంవత్సరం దేశ జీడీపీ 6.5 శాతంగా నమోదు కావచ్చని ఇండియా రేటింగ్స్ అండ్ రిసెర్చ్ అంచనా వేసింది. అయితే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023-24) వృద్ధిరేటును 7.3 శాతంగా అంచనా వేస్తున్న నేపథ్యంలో ఇది ప్రాధాన్యతను సంతరించుకున్నది. తాజా అంచనా.. 2024-25లో భారత ఆర్థిక వ్యవస్థ మందగమనంలోకి వెళ్తుందన్న సంకేతాలను ఇస్తున్నది మరి. నిజానికి ఒక్క రిజర్వ్ బ్యాంక్ మినహా మిగతా ఏజెన్సీల అంచనాలన్నీ 6.5 శాతం దరిదాపుల్లోనే ఉండటం గమనార్హం. ఆర్బీఐ వచ్చే ఆర్థిక సంవత్సరం దేశ వృద్ధిరేటు 7 శాతంగా ఉండొచ్చంటున్నది. ఇక ఐఎంఎఫ్ 6.4 శాతమే అంటుండగా, ప్రపంచ బ్యాంక్, మోర్గాన్ స్టాన్లీలు కూడా 6.5 శాతమని చెప్తున్నాయి. కాగా, అంతర్జాతీయ మందగమన ప్రభావం భారతీయ ఎగుమతులపై ఉంటుందని ఇండియా రేటింగ్స్ హెచ్చరించింది. ఈ క్రమంలోనే వచ్చే ఆర్థిక సంవత్సరం మరింత ప్రతికూల పరిస్థితులు ఎదురుకావచ్చని అభిప్రాయపడింది.

టాప్-3లో దేశీయ నిర్మాణ మార్కెట్!

2025నాటికి చైనా, అమెరికా తర్వాత భారత్‌దే: కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పురి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: దేశీయ నిర్మాణ రంగం జోష్ మీదున్నదని కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి అన్నారు. ఈ క్రమంలోనే 2025నాటికి చైనా, అమెరికా తర్వాత ప్రపంచంలో మూడో అతిపెద్ద నిర్మాణ రంగ మార్కెట్‌గా భారత్ అవతరించగలదన్న ఆశాభావాన్ని గురువారం వ్యక్తం చేశారు. దేశ జీడీపీలో నిర్మాణ రంగం వాటా 9 శాతంగా ఉన్నదన్న ఆయన.. దేశంలో ఉపాధినిస్తున్న రంగాల్లో రెండో స్థానంలో ఉందని, సుమారు 7.1 కోట్ల మంది నిర్మాణ రంగంపై ఆధారపడి జీవిస్తున్నారని వివరించారు. తద్వారా దేశ ఆర్థికాభివృద్ధిలో నిర్మాణ రంగం ప్రధాన పిల్లర్‌గా నిలుస్తున్నదన్నారు.

ఐరాస అంచనా..

ఐక్యరాజ్య సమితి అంచనా ప్రకారం 2047నాటికి భారత జనాభా 164 కోట్లకు చేరనున్నది. వీరిలో నగరాలు, పట్టణాల్లోనే దాదాపు 51 శాతం మంది నివసిస్తారని అంచనా. అందువల్ల తమ ప్రభుత్వం సైతం పెద్ద ఎత్తున మౌలిక వసతుల కల్పనకు ఖర్చు చేస్తున్నట్టు మంత్రి చెప్పారు. నిజానికి దేశీయ నిర్మాణ రంగం.. రియల్ ఎస్టేట్, పట్టణాభివృద్ధి అనే రెండు కీలక భాగాలుగా ఉంటుందన్నారు. రియల్ ఎస్టేట్ సెగ్మెంట్‌లో రెసిడెన్షియల్, ఆఫీస్, రిటైల్, హోటల్, లీజర్ పార్క్ ప్రాజెక్టుల వంటివి ఉంటాయన్నారు. అర్బన్ డెవలప్‌మెంట్ విభాగంలో నీటి సరఫరా, పారిశుద్ధ్యం, రవాణా, పాఠశాలలు, ఆరోగ్య సంరక్షణ ఉంటాయని చెప్పారు. దీంతో ఆయా విభాగాల అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు.

ఎఫ్‌డీఐల్లో..

విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ)ను ఆకర్షించడంలోనూ దేశీయ నిర్మాణ రంగం ముందున్నట్టు మంత్రి పేర్కొన్నారు. 6వ స్థానంలో ఉన్నట్టు తెలిపారు. గడిచిన 23 ఏండ్లలో రూ.2.6 లక్షల కోట్లకుపైగా ఎఫ్‌డీఐని అందుకున్నది. టౌన్‌షిప్, మాల్స్, వ్యాపార కార్యకలాపాల నిర్వహణ కోసం పూర్తయిన ప్రాజెక్టుల్లోకి ఆటోమేటిక్ మార్గం గుండా 100 శాతం ఎఫ్‌డీఐకి అనుమతి ఉన్నట్టు వివరించారు. రవాణా, నీటి సరఫరా, మురుగునీరు-దాని నిర్వహణకు సంబంధించీ ఇదే తరహాలో ఎఫ్‌డీఐకి అనుమతి ఉన్నట్టు గుర్తుచేశారు.

లక్ష కోట్ల డాలర్లకు..

2030నాటికి దేశీయ రియల్ ఎస్టేట్ రంగం విలువ లక్ష కోట్ల డాలర్లకు చేరవచ్చని అంచనా. అయితే 2047 నాటికి ఇది 5.8 లక్షల కోట్ల డాలర్లకు చేరుతుందని కూడా అంచనాలున్నట్టు మంత్రి అంటున్నారు. నిర్మాణ రంగం వేగంగా పురోగమిస్తుండటంతో సిమెంట్, స్టీల్ తయారీ కూడా బాగా జరుగుతున్నట్టు తెలిపారు. నిర్మాణ రంగానికి 250కిపైగా అనుబంధ రంగాలున్నాయని, వీటన్నిటిలో దేశంలోని 18 శాతం కార్మిక శక్తి పనిచేస్తున్నదని చెప్పారు.

కొత్తగూడెంలో రాయల్ ఓక్

హైదరాబాద్, ఫిబ్రవరి 22: ప్రముఖ ఫర్నిచర్ విక్రయ సంస్థ రాయల్‌ఓక్..తెలంగాణలో తన వ్యాపార విస్తరణలో భాగంగా కొత్తగూడెంలోకి ప్రవేశించింది. 16 వేల అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ స్టోర్‌లో లివింగ్ రూమ్‌లు, బెడ్‌రూం, డైనింగ్ రూంకు సంబంధించిన అన్ని రకాల ఫర్నిచర్లు లభించనున్నాయని రాయల్‌ఓక్ చైర్మన్ విజయ్ సుబ్రమణ్యం తెలిపారు. కస్టమర్లకు సరసమైన ధరల్లో అత్యుత్తమ ఫర్నిచర్ అందించాలనే ఉద్దేశంతో ఈ స్టోర్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తెలంగాణలో సంస్థకు ఇది 25వ స్టోర్ కాగా, దేశవ్యాప్తంగా 166 స్టోర్.

చివరి గంటలో జోష్

రికార్డు స్థాయికి చేరుకున్న నిఫ్టీ • 500 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్

ముంబై, ఫిబ్రవరి 22: తీవ్ర ఊగిసలాటల మధ్య కొనసాగిన సూచీలు చివరి గంటలో మదుపరులు ఎగబడి కొనుగోళ్లు జరపడంతో భారీగా లాభపడ్డాయి. దేశ ఆర్థిక పరిస్థితులు కుదుటపడే అవకాశం ఉన్నట్లు వచ్చిన సంకేతాలు, అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల అంశాలు పెట్టుబడిదారుల్లో జోష్ పెంచింది. కనిష్ఠ స్థాయి నుంచి 1,200 పాయింట్ల శ్రేణిలో కదలాడిన 30 షేర్ల ఇండెక్స్ సెన్సెక్స్ లాభాల్లోకి వచ్చింది. ఐటీ, టెక్నాలజీ, ఆటోమొబైల్ రంగ షేర్లకు పెట్టుబడిదారుల నుంచి లభించిన మద్దతుతో సెన్సెక్స్ 535.15 పాయింట్లు అందుకొని 73,158.24 వద్ద ముగిశాయి. 72,677 వద్ద ప్రారంభమైన సెన్సెక్స్ ఇంట్రాడేలో 73,256 పాయింట్ల గరిష్ఠ స్థాయిని తాకింది. మరో సూచీ నిఫ్టీ ఆల్‌టైం హైకీ చేరుకున్నది. ఇంట్రాడేలో 22,252 పాయింట్లను తాకిన నిఫ్టీ చివర్లో 162.40 పాయింట్లు అందుకొని 22,217.45 వద్ద ముగిసింది. ఇది కూడా సూచీలకు రికార్డు స్థాయి ముగింపు. ఈ నెల 20న సూచీ 22,196 పాయింట్ల గరిష్ఠ స్థాయికి చేరుకున్న విషయం తెలిసిందే. గురువారం కనిష్ఠ స్థాయికి పడిపోయిన సూచీలు చివర్లో భారీగా కోలుకున్నాయని, యూరోజోన్ దేశాల పీఎంఐ డాటా ఆశాజనకంగా ఉండటం, అమెరికాకు చెందిన టెక్నాలజీ సంస్థల షేర్లు భారీగా లాభపడటం సూచీలు కోలుకోవడానికి ప్రధాన కారణమని దలాల్ స్ట్రీట్ వర్గాలు వెల్లడించాయి.

- హెచ్‌సీఎల్ టెక్ 3 శాతానికి పైగా పెరిగి టాప్ గెయినర్‌గా నిలిచింది.
- దీంతోపాటు ఐటీసీ, మహీంద్రా, టీసీఎస్, టెక్ మహీంద్రా, ఎల్‌అండ్‌టీ, విప్రో, మారుతి, యాక్సిస్ బ్యాంక్, ఇన్ఫోసిస్, టాటా స్టీల్, ఐసీఐసీఐ బ్యాంక్, టాటా మోటర్స్, ఎన్‌టీపీసీలు ఒక్క శాతానికి పైగా పెరిగాయి.
- సన్‌ఫార్మా, రిలయన్స్, పవర్‌గ్రిడ్, ఏషియన్ పెయింట్స్, నెస్లె, బజాజ్ ఫిన్‌సర్వ్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ షేర్లు లాభాల్లో ముగిశాయి.
- ఇండస్‌ఇండ్ బ్యాంక్ 1.87 శాతం పతనం చెంది టాప్ లూజర్‌గా నిలిచింది.
- దీంతోపాటు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, కొటక్ బ్యాంక్, హెచ్‌యూఎల్, ఎస్బీఐ, ఎయిర్‌టెల్, బజాజ్ ఫైనాన్స్, అల్ట్రాటెక్ సిమెంట్, టైటాన్‌లు నష్టపోయాయి.
- బీఎస్ఈ మిడ్‌క్యాప్, లార్జ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ ఇండెక్స్‌లు లాభాల్లో ముగిశాయి.
- రంగాలవారీగా చూస్తే ఆటో 1.85 శాతం అధికమవగా, ఐటీ 1.83 శాతం, క్యాపిటల్ గూడ్స్ 1.80 శాతం చొప్పున పెరిగాయి. అలాగే టెక్ 1.59 శాతం, ఇండస్ట్రీయల్స్ 1.50 శాతం, పవర్ 1.38 శాతం అధికమయ్యాయి.

ఐదు నెలల గరిష్ఠానికి రూపాయి

ముంబై, ఫిబ్రవరి 22: ప్రపంచ మార్కెట్లో డాలరు బలహీనపడిన నేపథ్యంలో రూపాయి మారకపు విలువ ఐదు నెలల గరిష్ఠస్థాయికి చేరింది. గురువారం ఇంటర్‌బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజ్ (ఫారెక్స్)లో 82.94 వద్ద ప్రారంభమైన రూపాయి చివరకు క్రితం ట్రేడింగ్ రోజుతో పోలిస్తే 11 పైసలు లాభపడి 82.85 వద్ద ముగిసింది. ఇది ఐదు నెలల గరిష్ఠస్థాయి. నిరుడు సెప్టెంబర్ 4 తర్వాత ఈ స్థాయిలో దేశీ కరెన్సీ ముగియడం ఇదే ప్రథమం. యూఎస్ డాలర్ బలహీనత, దేశీయ స్టాక్ మార్కెట్‌లో పాజిటివ్ ట్రెండ్ నెలకొనడం రూపాయి ర్యాలీకి కారణమని బీఎన్‌పీ పారిబా రీసెర్చ్ అనలిస్ట్ అనూజ్ చౌదరి చెప్పారు. ఆరు ప్రధాన కరెన్సీల బాస్కెట్ అయిన డాలర్ ఇండెక్స్ 0.31 శాతం తగ్గి 103.68 వద్ద ట్రేడవుతున్నది. బీఎస్ఈ సెన్సెక్స్ 535 పాయింట్ల లాభంతో 73,158 పాయింట్ల వద్ద నిలిచింది. ప్రపంచ మార్కెట్లో బ్యారల్ క్రూడాయిల్ ధర 79 డాలర్ల స్థాయిని దాటింది.

శాటిలైట్ తయారీకి ఊతం

-అంతరిక్ష రంగంలో 100 శాతం ఎఫ్‌డీఐ అనుమతిపై నిపుణులు -స్టార్టప్‌లకూ ఉత్సాహమన్న అంచనాలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: అంతరిక్ష రంగం కోసం కేంద్ర ప్రభుత్వం సరళతరం చేసిన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) నిబంధనలు.. శాటిలైట్ల తయారీకి ఊతమివ్వగలవని నిపుణులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా స్టార్టప్ ఎకోసిస్టమ్‌కు ఇవి కలిసిరాగలవని అభిప్రాయపడుతున్నారు. స్పేస్ రంగంలోని భారతీయ సంస్థలు.. అంతర్జాతీయ కంపెనీలతో జట్టు కట్టేందుకూ మార్గం సుగమమైందని, ఇక నూతన ఆవిష్కరణలు పుంజుకోగలవన్న ఆశాభావాన్నీ వ్యక్తం చేస్తున్నారు. శాటిలైట్ల కోసం విడిభాగాల తయారీలో 100 శాతం విదేశీ పెట్టుబడులకు అనుమతిస్తూ బుధవారం కేంద్రం ఎఫ్‌డీఐ నిబంధనల్ని సవరించింది.

ఈ రంగంలో విదేశీ సంస్థల్ని, ప్రైవేట్ కంపెనీల్ని ఆకర్షించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నది. కాగా, ఈ మేరకు విడుదలైన అధికారిక ప్రకటన ప్రకారం శాటిలైట్ ఉప రంగాన్ని మూడు విభిన్న కార్యకలాపాలుగా విభజించారు. ఒక్కో రంగంలో విదేశీ పెట్టుబడి కోసం పరిమితులతో కూడిన నిర్వచనాల్నీ చెప్పారు. అయితే అంతరిక్ష రంగంలో శాటిలైట్ తయారీకి సంబంధించి 100 శాతం ఎఫ్‌డీఐని అనుమతించినా.. ప్రభుత్వం సూచించిన మార్గంలోనే కార్యకలాపాలు సాగాలి. ఈ క్రమంలోనే శాటిలైట్ తయారీ, ఆపరేషన్, శాటిలైట్ డాటా ప్రొడక్ట్స్, గ్రౌండ్, యూజర్ సెగ్మెంట్లలోకి ఆటోమేటిక్ మార్గంలో 74 శాతం వరకు ఎఫ్‌డీఐకి అనుమతి ఉన్నది. ఈ పరిమితి దాటితే ప్రభుత్వ ఆమోదం తప్పనిసరి. ఇక లాంచ్ వెహికిల్స్, అసోసియేటెడ్ సిస్టమ్స్ లేదా సబ్‌సిస్టమ్స్, స్పేస్‌క్రాఫ్ట్ రాకపోకల కోసం స్పేస్‌పోర్ట్స్ నిర్మాణానికి ఆటోమేటిక్ మార్గంలో 49 శాతం వరకు ఎఫ్‌డీఐని అనుమతిస్తున్నారు. అంతకు మించితే ప్రభుత్వ అంగీకారం కావాల్సిందే. ఇంకా విడిభాగాల తయారీ, శాటిలైట్ల కోసం సిస్టమ్స్/సబ్‌సిస్టమ్స్, గ్రౌండ్, యూజర్స్ సెగ్మెంట్స్‌కు ఆటోమేటిక్ మార్గంలో 100 శాతం వరకు విదేశీ పెట్టుబడులను అనుమతిస్తున్నారు. 'ఈ కొత్త విధానం.. లాంచ్ వెహికిల్స్, శాటిలైట్ల తయారీ, అసెంబ్లింగ్ కోసం మన స్టార్టప్ ఎకోసిస్టమ్‌కు తప్పక సహాయపడుతుంది' అని డెలాయిట్ భాగస్వామి శ్రీరామ్ అనంతశయనం అన్నారు. ఇక విదేశీ సంస్థలతో కలిసి ముందుకెళ్లే అవకాశం భారతీయ సంస్థలకు లభిస్తుందని నంగియా అండర్సన్ ఇండియా రెగ్యులేటరీ డైరెక్టర్ మయాంక్ అరోరా అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం భారతీయ అంతరిక్ష రంగంలో 200లకుపైగా స్టార్టప్‌లున్నాయని అంచనా. అంతేగాక అంతర్జాతీయ స్పేస్ ఎకానమీలో భారతీయ ప్రైవేట్ స్పేస్ రంగం వాటా దాదాపు 2 శాతంగా ఉన్నది. అయితే 2040 నాటికి ఇది సుమారు 10 శాతానికి చేరగలదన్న అంచనాలున్నాయి.